# నది వెనక్కి పోతే?



చెల్లూరి సత్య రాజేశ్వర రావు

పుల్లయ్య పగలల్లా కూలిపని చేసి మునిమాపు వేళ ఇంటికి చేరుకున్నాడు. గుడిసెముందు చింత చెట్టు క్రింద పింగారి కుండతో

అన్నం వండుతోంది. పొయ్యి మండక పొగ వస్తోంది. పుల్లయ్య కూలి డబ్బులు ఏడున్నర ఆమె కిచ్చాడు.

"లచ్చే....ఆ యిలాయి బుడ్డి ఇట్టా పట్రా!" సింగారి కేక వేసింది.

అరుగుమీద గడప మీద దీపం వెలుగుతోంది. ప్రక్కనున్న చాపలో సింగారి కొడుకులు పదేళ్ళ లోపు వారు కుస్తీలు పడుతున్నారు. లచ్చి తమ్ముళ్ళను చూస్తోంది- చంకలో పిల్లని ఎత్తుకుని. లచ్చి రాకపోవడం చూసి సింగారి బూతు వదిలింది.

లచ్చి భయంగా దీపం పట్టుకు వచ్చింది. సింగారి డబ్బు లెక్క పెట్టి, "అద్ద రూపాయి తక్కువైంది" సాగదీసింది.

"పొగాకు కొనుక్కున్నాను, ఒదినే!"

"ఎసనాలు బాగానే వున్నాయి" ఈసడించి కొంగుకు ముడేసుకుంది.

తేలిగ్గా వదిలినందుకు పుల్లయ్య సంతోషించాడు. ఎదురుగా వున్న పిల్లకాలవలో స్నానం చేశాడు.

చీకటి చిక్కగా పడింది. గుడిసెల్లో గుడ్డిదీపాలు వెలుగుతున్నాయి. కొన్ని గుడిసెలు నిషాగా ఉన్నాయి. కొన్ని పోట్లాటల్లో ఉన్నాయి.

పుల్లయ్య నులకమంచం వాల్చుకుని కూర్చున్నాడు. ఆకలి నకనకలాడిపోతోంది. పొయ్యి మీద ఉడుకుతున్న చేపల పులుసు ఆకల్ని పెంచుతోంది.

శివన్న సైకిల్ దిగి రోడ్డు ప్రక్కనున్న అరటి చెట్టుకి జేరవేశాడు. "పుల్లయ్య వచ్చాడంటే?" దూరాన్నుంచే కేక వేశాడు.

అప్పటిదాకా అల్లరిచేసే పిల్లలు నోర్మూసుకున్నారు. శివన్న సాయంత్రం మందుమీద ఉంటాడు.

సింగారికి వినబడలేదు.

"ఏమే లంజా! మాట్లాడవు!" కాలితో తన్నాడు.

"ఓరి నీ జిమ్మడ! నీకేం రోగంరా? సివాలెక్కి సత్తన్నావు?" సింగారి ఆ తాపుకి క్రింద పడింది. తాపు బలంగా తగిలింది.

"నేను సివాలెక్కి సత్తన్నానా?" మరో రెండు వేశాడు. "కొట్టకన్నా" పుల్లయ్య వచ్చి అడ్డుపడ్డాడు.

"ఓరి నాకొడక, ఇక్కడే ఉండి పలకవేంరా? కామందు గోరి దానెం పొలాన వుండినయి. రేతిరి నీవు పోయి కాపలా వుండు. సెంద్రిగాడు కూడా వుంటాడ్లే!"

పుల్లయ్య తలూపాడు. శివన్న గుడిసెలోకి పోయి బట్టలు విప్పి

గోచీ పెట్టుకుని చుట్ట కాల్చుకుంటూ వచ్చాడు.

"ఇంకా కదలవేంరా?" తమ్ముడిని కేక వేశాడు.

"వన్నం బోంసేపి ఎలతాను." బెరుకుగా చెప్పాడు.

"ఆ ఎదవ అప్పుడే వండి వార్చినాదేటి?"

"మద్దినేల కూడుంది. తిని పో. నాకేం నాలుగు సేతులు లేవు. పవలెల్లా నానూ రెక్కలు ఇర్సుకుంటున్నాను."

మధ్యాన్నం అన్నం నీళ్ళు కారుతోంది. వాసన. చింతపండు కారం రాసుకున్నా పుల్లయ్యకి మింగుడు పడటంలేదు. తొందరగా కుక్కుకుని చుట్ట వెలిగించి పొలం బయల్దేరాడు.

ఊరి పొలిమేరదాకా పంచాయితీ దీపాలున్నాయి. అక్కడ్నుంచి చీకటి. కాలువగట్టు దిగి చేలు దాటుకుంటూ కుప్ప దగ్గరకి వచ్చాడు.

చంద్రయ్య అప్పటికే ఉన్నాడు. "రా రా, నీకోసరం సూత్తన్నా! అగ్గిపెట్టేది? సుట్ట ఆరిపోనాది."

గట్టుమీద గడ్డి ఒత్తుగా వేసుకుని దానిమీద కొబ్బరి ఆకులు వేసుకుని పక్క ఏర్పాటు చేసుకున్నారు. కొంచెంసేపు కబుర్లు చెప్పుకున్నారు. పుల్లయ్యకి నిద్ర పట్టేసింది.

కేకలకి మెలకువ వచ్చింది. పొద్దు పొడిచింది. తాటిచెట్ల మీద కాకులు అరుస్తున్నాయి. రామప్రభు, ఆయన కొడుకు, బండివాళ్ళు, షావుకారు ఉన్నారు. చంద్రయ్య చేతులు కట్టుకుని నించున్నాడు.

"ఎవరికీ తెలియకుండా చేలో ధాన్యం ఏమయ్యాయిరా? నిజం చెప్పండి!" రామప్రభు గద్దించాడు.

పుల్లయ్య చూశాడు. ధాన్యరాశి శూన్యం.

"కడుపు నెప్పిగా వుందని సగం రేతిరేళ ఇంటికి పోనానండి. నాను వచ్చి చూసేసరికి దాన్నెం లేవండి. లగెత్తుకుని మీకాడకి వచ్చినా!" చంద్రయ్య చెప్పాడు.

"అయితే ఇది వీడి పనే!" రామప్రభు కొడుకు, పుల్లయ్యని చూపించి "మనం నమ్మడం కోసం దొంగతనం కానిచ్చి దొంగ నిద్ర నటించాడు."

అందరూ పుల్లయ్యను దొంగ చేశారు. రామప్రభు బడితె పుచ్చుకుని వాయించాడు కూడా. శివన్నని పిలిపించారు. వాడూ తమ్ముడ్ని తిట్టాడు, కొట్టాడు.

"ధాన్యం బాధ్యత నీదేరా శివన్నా! రామప్రభు నీకే అప్ప

గించాడు. వాటి ధర నువ్వే కట్టు కోవాలి" గ్రామ పెద్ద తగవు చెప్పాడు.

శివన్న ఒప్పుకోక తప్పలేదు. తగవు తీరేసరికి మధ్యాన్నం రెండు గంటలయింది. అన్న దమ్ములు బయలుదెరారు. పొద్దుట నుంచి పుల్లయ్య ఏమీ తినలేదు. నీర్సంగా వుంది.

"ఓరి కుక్కల కొడకా! నువ్వెక్కడ దొరికావురా!" శివన్న తిడు తున్నాడు.

శివన్నకి యాభై వుంటాయి. గూడేనికి పెద్ద. రామప్రభు వ్యవసాయంలో పెద్ద పాలేరు. శివన్న ప్రక్కగా నాలుగెకరాలు కౌలు వ్యవసాయం కూడా చేస్తు న్నాడు. అతడి యిల్లు గూడేనికి, వూరికి మొగలో వుంది. అంచేత ఓ కొడుకుచేత సారా కొట్టు పెట్టించాడు. నాలుగు విధాలా డబ్బు నొల్లుతున్నాడు.

పుల్లయ్యకి అన్న వయసులో సగం వుంటుంది. పెద్ద తెలివైన వాడుకాదు. బలమైన శరీరమున్నా పిల్లి! అన్న కళ్ళెర్రజేస్తే చాలు!

గుడిసె దగ్గర పడుతుండగా, "దానెం నేను దొంగిలించ లేదన్నా! నాకేం తెల్వదు" మళ్ళీ చెప్పాడు.

"ప్....ఎదవ....ఇంకా అదే కూత!"

శివన్న కాలువలో కాళ్ళు కడుక్కుని, గుడిసెలోకి పోయాడు. పుల్లయ్య దిగాలుగా కూర్చున్నాడు అరుగుమీద.

సింగారి అన్నానికి పిలవలేదు.

"మన పీకమీదకి తెస్తే ఎలా? ఇన్నాళ్ళు తెలివితక్కువ వోడని సూసాం. మనకి మాట దక్కించ డం లేదు. ఏరే కాపురం తాగ మను." సింగారి అన్నం తింటున్న మొగుడితో చెప్పింది.

శివన్న నిషామీద లేకపోతే పెళ్ళాం చెప్పినట్లే వింటాడు. "అలాగే....ఎన్నాళ్ళు సూ త్తాం మనం మా త్తరం?"

మొగుడు ఆలస్యం చేస్తాడని, "అరుగుమీద గది, ఎనక ఒసారా ఆడిదని సెప్పు." సింగారి మరింత ముందుకు పోయింది.

శివన్న భోంచేసి చెప్పులేసు కుంటూ, "ఏరుగా వుండరా అబ్బాయ్! నీకూ నాకూ ఏం సంబంధమూ లేదిక!" అని వెళ్ళి పోయాడు.

పుల్లయ్య మోకాళ్ళ మీద తల పెట్టుకుని కూర్చున్నాడు. "వేరుగా వుండాలా!" గొణుక్కున్నాడు.

సింగారి, పిల్లలు అన్నం

తింటున్నారు. ఈ పూట కయినా పిలుస్తారనుకున్నాడు పుల్లయ్య. ఆకలి మండించి వేస్తూంది. వాళ్ళు పిలవలేదు.

సింగారి రెండు చిన్నకుండలు, అల్యూమినం గిన్నెలు రెండు అక్కడ పెట్టి, "ఇవే మీయమ్మ యిచ్చినవి" అంది.

సింగారికి మరదంటే ఎప్పట్నుంచో కోపం. తన పింతండ్రి కూతురు దుర్గిని చేసుకోనన్నాడని. దుర్గి కుంటిది. అయితేనేం ఆమె తండ్రి మూడువేలు కట్నం యిస్తానన్నాడు.

ఈ మార్పు పుల్లయ్యని కదిల్చి వేసింది. ఆకలి వేస్తున్నా లెక్కచేయలేదు. చాపలో పడుకున్నాడు గదిలో.

రాత్రయింది. "ఆడు వొండుకున్నాడంటే?" శివన్న పెళ్ళాన్ని అడిగాడు.

"తినక సత్తాడా? యిన్నాళ్ళు ఎచ్చగా అన్ని అమర్చాం. ఇపుడు తెలస్తాది" సింగారి మాటలు పుల్లయ్యకి వినిపిస్తున్నాయి.

తెల్లవారింది. పుల్లయ్యకి ఆకలి ఘోరంగా వేస్తోంది. లచ్చి తమ్ముడికి హోటల్‌నుంచి తెచ్చిన రొట్టి తినిపిస్తోంది. అది చూసి మరింత నోరూరింది. బయటపడాలి. ఇంట్లో ఏముంది తినడానికి?

పుల్లయ్య వూళ్ళోని గంగప్ప హోటల్‌కి వచ్చాడు. డబ్బులు లేవు. "సాయింతరం యిస్తానయ్యా...."

అతడు సెప్పకుండానే గంగప్ప, "అరువా? నా బాబే! తినేసి అల్లుళ్ళలా పోతారు. మధ్యన చచ్చేది నేను. లాభంలేదు. పో!" అరచాడు.

పుల్లయ్య రోడ్డు ఎక్కి బ్రిడ్జి మీద కూర్చున్నాడు. ఇంతలో దానవాయి కనిపిస్తే, "ఓ పావలా అప్పీరా!" అనడిగాడు.

"దానెం డబ్బు అప్పుడే అయిపోనాదేంట్రా?" వాడు వేళాకోళం చేశాడు ఆగకుండా పోతూ.

ఎవరూ నమ్మరేంటి? తాను దొంగ కాదంటే. పుల్లయ్యకి చెడ్డ బాధ వేసింది. అక్కడ కూర్చోవడం వల్ల వుపకారం కంటె అపకారంగా వుంది. తెలుసున్న వాళ్ళంతా 'ధాన్యం దొంగతనం' గురించి అడుగుతున్నారు.

పుల్లయ్య లేచి నడుస్తున్నాడు! ఎక్కడికి పోవాలి? తెలియడం లేదు. ఆకలిబాధ. అవమానం బాధ.

దుర్గ గుడిదగ్గరకి వచ్చాడు. ఓ రైతు కూలీలను బేరం చేస్తు

న్నాడు. "నానూ వత్తాను" పుల్లయ్య చెప్పాడు.

"నువ్వా! పనా....ఏదో పుచ్చుకుని లేచిపోతావు" అన్నాడు రైతు. మిగతావాళ్ళు ఘొల్లున నవ్వారు.

"నానా దొంగతనం సేయలేదు" పుల్లయ్య అరిచాడు. కాని ఎవరూ నమ్మలేదు. వారిని నమ్మించడం వృథా అని తెలిసి అక్కడ్నుంచి బయలుదేరాడు.

పుల్లయ్య మరో రెండు మూడు చోట్ల పనికి అడిగాడు. ఎవరూ పెట్టుకోలేదు. సాయంత్రం దాకా అక్కడా యిక్కడా తిరిగి గుడిసెకి చేరుకున్నాడు.

ఈరోజు ఏమీ తినలేదు.

"తిన్నావురా?" అని శివన్న అడగలేదు.

పుల్లయ్యలో ఆకలి కేకలు, ఆవేశం, ఏదో చెయ్యాలన్న కసి! ఆకలికి మంచినీళ్ళు తప్ప మరో జవాబు లేదు.

మర్నాడు కూడా పని లేదు. తిండిలేదు. శివన్న, పింగారి ప్రక్కనున్నా శత్రువుల్లా తొంగి చూడటం లేదు.

ఎన్నాళ్ళీ పస్తులు?

పుల్లయ్య చీకటి పడ్డాక వూళ్ళోకి నడిచాడు. దేవాలయం అరుగు మీద కూర్చున్నాడు. లోపల పూజ జరుగుతోంది. మంత్రాలు వినిపిస్తున్నాయి. కొంచెం సేపటికి పూజారి అక్కడ కూర్చున్న వారికి 'పులిహోర' ప్రసాదంగా పెట్టాడు. పుల్లయ్యకీ పెట్టాడు. అది తినగానే నిద్రపోయిన ఆకలి లేచింది.

రాత్రిదాకా అక్కడే కూర్చున్నాడు. వూరు మాటు మడిగింది. పుల్లయ్య ప్రక్కనున్న కొబ్బరి తోటలోకి నడిచాడు. చెట్టు ఎక్కాడు. పది కాయలు కోశాడు. వాటిని కట్టి రోడ్డు ఎక్కాడు. ఎవరూ చూడలేదు. షావుకారికి అమ్మాడు. ఏడు రూపాయలు వచ్చాయి. డబ్బున్నా ఆవూళ్ళో ఆవేళ తినడానికేం దొరకదు. పోతున్న ట్రాక్టరు ఆపి టౌన్‌కి వచ్చాడు. ఇరానీ హోటలు తెరిచి వుంది. పలావ్ తిని టీ త్రాగాడు. ఆకలి శాంతించింది.

ఇంకా రెండో ఆట వదల్లేదు. రోడ్డు ప్రక్కన మూడు ముక్కలాట జరుగుతోంది. పుల్లయ్య అందులో కూర్చున్నాడు. ఇరవై రూపాయలు వచ్చాయి. పుల్లయ్య రెండు సీసాలు రమ్ము తాగాడు. నిషా అందుకుంది. సత్రపు అరుగుమీద పడుకున్నాడు.

పగలు పదకొండు గంటలకు

మెలకువ వచ్చింది. హోటల్లో సుష్టిగా భోంచేసి యింటికివచ్చాడు.

"పిన్నాన్నా! ఏడకి పోయావు?" లచ్చి అడిగింది.

మాట్లాడ లేదు. పడు కున్నాడు. రాత్రి తిరిగి బయలు దేరాడు. ఇవాళ పాతిక కాయలు తీశాడు. రోడ్డు మీదకి రాగానే ఒకడు, "ఎక్కడివి కాయలు?" అడిగాడు.

"నీకు చెప్పాలా?" గర్జించాడు.

వాడు తిరిగి మాట్లాడలేదు. పుల్లయ్య నవ్వుకున్నాడు. పడి వుంటే లాబంలేదు-ఎదురుతిరగాలి.

వారం రోజులపాటు కొబ్బరి కాయలు దొంగతనంగా తీశాడు. రోజులు హాయిగా వెళుతున్నాయి. ఈ చిన్న పనితో ఎన్నాళ్ళు? మున్స బుగారి బెల్లం కొట్టు కన్నం వేసి, రోజూ రెండు కట్టలు, పది రోజుల పాటు దొంగిలించాడు. పుల్లయ్యకి తన మీద నమ్మకం ఏర్పడింది. మస్తుగా తింటున్నాడు. మత్తుగా తాగుతున్నాడు.

పుల్లయ్య దగ్గిరకి డబ్బు చేర డంతో అప్పాలు, చిన్న, మాలో కం, తూమప్ప దగ్గరకి చేరారు. వాళ్ళు చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నారు. పుల్లయ్య వారిని సాయం చేసుకుని పెద్ద దొంగతనా ల్లోకి దిగాడు. డబ్బు, బంగారం వచ్చి పడుతోంది.

మరది యిలా బాగుపడి పోవ డం పింగారికి కన్ను కుట్టింది. అసహనంతో "సీ...అదీ సంపా దనే... ఎదవ దొంగ బతుకు. జన మకి బుద్ధుండాలా!" అందోరోజున మరది వస్తూండగా.

"నీకెందుకే, నోరుమూసుకో!"

"పాపం పండితే నీనోరే మూత్తారు."

అంతే! పుల్లయ్య పరుగునవచ్చి పింగారి జుట్టు పట్టుకుని వాయిం చేశాడు. రాత్రి శివన్న రాగానే చెప్పింది.

"ఆడు తుంటరెదవే! ఆడిజోలికి పోక!" శివన్న పెళ్ళాన్నే మంద లించాడు. పుల్లయ్య రౌడీ తనం అతడికి బాగా తెల్సు.

పుల్లయ్య ఎప్పుడో కానీ గుడి సెకు రాడు. రాజీ యింటి దగ్గర వుంటాడు. అతడి ముఠాకూడా అక్కడే కల్సుకుంటుంది.

రాజీ ప్రొద్దుట కల్లు అమ్ము తుంది. సాయంత్రం సారా అమ్ము తుంది. నల్లగా లావుగా వున్నా కళగా వుంటుంది. మొగుడు ఖూనీ కేసులో యిరుక్కుని కువైట్ పారి పోయాడు.

ఓరాత్రి మందు ఎక్కువై పుల్లయ్య అక్కడే పడి పోయాడు.

సగం రాత్రి మెలకువ వచ్చింది. ప్రక్కన రాజీ! కేవలం లంగాతో కౌగలించుకుంది. "నువ్వంటే యిష్టం బావయ్యా" అంది.

పుల్లయ్య మిగులు సొమ్ము రాజీకే యిస్తున్నాడు.

"మనువు ఆడేద్దాం రాజీ!" అన్నాడో రోజున.

"ఏటి తక్కువయినాది? ఏ రేతి రయినా నీకాడకి రానన్నానా?"

"మనువు మనకోసమేటి— లోకంకోసం."

"అయితే కానీ! మూర్తాలు లేవంట కదా!"

రెండు నెలలు జరిగాయి. పుల్లయ్య ముహూర్తం పెట్టి తీసుకువచ్చాడు. "ముట్టయినాను పొద్దుటే!" అంది రాజీ.

మనువు వాయిదా పడింది. పడుతోంది. రాజీ వాయిదా వేస్తోంది. మొగుడు బాగా డబ్బు సంపాదించాడని, తిరిగి వస్తానంటున్నాడని నర్సింగరావు వార్త తెచ్చాడు. అదీ కారణం. రాజీకి పెళ్ళయినట్లు పుల్లయ్యకి తెలియదు.

ఓ సాయంత్రం రాజీ ఒడిలో పడుకుని కబుర్లు చెబుతూండగా, అప్పాలువచ్చి, "రామపెభుగారు నిన్ను రమ్మంటున్నాడట. పాలేరు వచ్చాడు" చెప్పాడు.

"రానని సెప్పరా గాడిదా!"

అప్పాలు వెళ్ళిపోయాడు. "ఎందుకో సూపి రాకూడదా! పెద్దోళ్ళతో పని!" సాగదీసింది రాజీ.

"నిన్ను వదిలి ఎల్లనా! అది నావల్ల కాదు."

మర్నాడు ప్రొద్దుట పుల్లయ్య ముఖం కడుగుతూండగా రామప్రభు స్వయంగా వచ్చాడు. ఆయన రావడం చూసి పుల్లయ్య "మీరు రావాలా!" ముఖం కడుక్కుని దగ్గరకి వచ్చాడు.

"అలా వెళదాం! రహస్యంగా మాట్లాడాలి."

రాజీ యిచ్చిన టీ రెండు గుక్కల్లో త్రాగి ఆయన వెంట ప్రక్కనున్న సర్వేతోటలోకి నడిచాడు.

రామప్రభుకి వ్యవసాయాలున్నాయి. వ్యాపారాలున్నాయి. అవి తెచ్చే సంపద వుంది. అన్ని రాజకీయ పార్టీలకి చందాదారుడు. రామప్రభుకి ఈమధ్య రాజకీయాల్లో దిగి పదవి పొందాలని వుంది. అసెంబ్లీకి అధికార పార్టీ టికెట్ కోసం యిప్పట్నుంచే ప్రయత్నాలు ప్రారంభించాడు.

కాని వత్సవాయి అడ్డు పడు

తున్నాడు. వత్సవాయి కూడా సంపదలో తనతో సమవుజ్జీ! ఒకే కులం. ఓసారి సమితి ప్రెసిడెంటు చేశాడు కూడ. వత్సవాయి కూడ అసెంబ్లీకి ప్రయత్నిస్తున్నాడు. టిక్కెట్టు అతడికే వచ్చేలా వుంది.

"వత్సవాయి నాలుగు నెలలు మంచం దిగ కూడదురా! పూర్తిగా లాగేస్తే యింకా సంతోషం." రామప్రభు మూడు వేలు తీసి యిచ్చాడు.

పుల్లయ్యకి ఏం చేయాలో తెల్సింది.

"పనికానియ్! మరో ఏడు వేలు యిస్తా."

పుల్లయ్య ఒప్పుకున్నాడు. రామప్రభు వెళ్ళిపోయాడు. ఒకనాడు చెయ్యని దొంగతనానికి కొట్టిన రామప్రభు, తన పని మీదవచ్చాడు. పుల్లయ్య నవ్వుకున్నాడు.

పది రోజులు గడిచాయి. పుల్లయ్య చిల్లర దొంగ తనాలు అనుచరులకి వదిలి వత్సవాయిని గమనిస్తున్నాడు.

వత్సవాయి రోజూ రాత్రి పది గంటల ప్రాంతంలోపట్నం నుంచి వస్తాడు స్కూటర్ మీద. పట్నంలో రెండు ధాన్యం మిల్లులున్నాయి అతడికి. వాటి వ్యవహారాలు చూసుకుని రాత్రి వస్తాడు.

హైవే దిగాక వూళ్ళో వచ్చే దారిలో డొంకలున్నాయి. అక్కడ జనసంచారం వుండదు. ఇంకా అరమైలు పోతేగాని వూరు రాదు.

పుల్లయ్య రోడ్డుమీద రాళ్ళు పేర్చి, మర్రిచెట్టు క్రింద సిగరెట్ కాల్చుకుంటూ వత్సవాయి కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ కార్యక్రమం సంగతి అనుచరులకి చెప్ప లేదు- వాటా యివ్వాలని! రాజీతో మాత్రం చెప్పాడు.

స్కూటర్ చప్పుడు. లైటింగ్ పడుతోంది. దగ్గరకి వచ్చింది. అవును. వత్సవాయి. రాళ్ళు చూసి ఆపి దిగాడు.

పుల్లయ్య మీద పడ్డాడు. వత్సవాయికి యాభై వున్నా బలిష్టంగా వుంటాడు. పుల్లయ్య కర్రదెబ్బని చేత్తో కాచుకొని కుడికాలితో పుల్లయ్య గుండెలమీద తన్నాడు. పుల్లయ్య వెల్లకిలా పడ్డాడు. వత్సవాయి వెంటనే ఆ కర్ర తీసుకుని పుల్లయ్యని తిరిగి లేవకుండా వాయించేశాడు.

రక్తం గాయాల మధ్య పుల్లయ్య! వత్సవాయి స్కూటర్ మీద వెళ్ళిపోయాడు.

ఓ గంటకి కూడా పుల్లయ్య లేవలేకపోయాడు. ప్రయత్నించినా

స్వాధీనం కాలేదు. గాయాలు బాధ పెడుతున్నాయి.

దొంగతనం కోసం తిరుగుతున్న అప్పాలు 'గురుడ్ని' రాజీ యింటికి తీసుకుపోయాడు.

రాజీ మంచి నిద్రలో వుంది. అది చెడింది. పుల్లయ్య గాయాలకి నూనె రాస్తూ, "ఎవ్వారం తిరగబడిందా?" అడిగింది.

"నూనె కాదే, డాక్టర్ని రప్పించు. ఒళ్ళు మండిపోతన్నాది."

"ఇంత రేతిరేళ ఎవడొస్తాడు? పుద్దుటే రప్పిత్తాలే. ఈ సారా తాగి తొంగో. నాకూ నిద్దర ఒస్తోంది" రాజీ ఆవలించింది.

పుల్లయ్యకి ఎంత తాగినా మత్తు ఎక్కలేదు. గాయాల బాధ.

* * *

పుల్లయ్య దెబ్బలు తినడం రామప్రభుకి తెలియదు. రోజూ వత్సవాయిని ఎప్పుడు కొడతావ్? అని కబురు పంపిస్తున్నాడు. పుల్లయ్య ఒంట్లో బాగోలేదని, లేచాక వత్సవాయి పని పడతానని చెబుతూ వచ్చాడు. నిజానికి దెబ్బలు గట్టిగా తగిలాయి. పుల్లయ్య మంచం దిగడం లేదు.

వత్సవాయి కూడా పుల్లయ్యను కొట్టానని ప్రచారం చేసుకోలేదు. ఇది తెలిస్తే ప్రత్యర్థి మర్నాడు చేయవచ్చు.

రామప్రభుకి మొత్తానికి పార్టీ టిక్కెట్టు వచ్చింది. వత్సవాయి కొత్త పార్టీ ప్రజాబంధునుంచి రామప్రభును ఎదుర్కొన్నాడు.

పోటీ నువ్వా? నేనా? అన్నంత తీవ్రంగా జరిగింది. వెయ్యి ఓట్లు స్వల్ప మెజారిటీతో రామప్రభు అసెంబ్లీకి ఎన్నికయ్యాడు.

కాని అతడి పార్టీ ఘోరంగా ఓడిపోయింది. పాతిక సీట్లకంటే రాలేదు. ప్రజాబంధు పార్టీ ఘన విజయం సాధించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే స్థితిలో ఉంది.

రామప్రభుకి సంతోషం ఇగిరిపోయింది. ఇంతాచేసి అపోజిషన్ లో కూర్చోవడమా?

వత్సవాయి ఓడిపోయినా పార్టీ వేడుకల్లో పాల్గొడానికి హైద్రాబాదు వచ్చి వున్నాడు. పార్టీ పెద్దలు ఓదార్చారు. వత్సవాయి చేసిన సేవలు గుర్తున్నాయన్నారు. ఓ సీటు ఖాళీ చేయించి ఉప ఎన్నిక పెట్టి రప్పించుకుంటామన్నారు. మంత్రిపదవీ రిజర్వ్ చేసామన్నారు.

రామప్రభు ప్రజాబంధు పార్టీలోకి దూకడానికి ప్రయత్నిస్తున్నాడు. "మీ జిల్లా ఛీఫ్ వత్సవాయిగారు కదా! ఆయన ఒప్పు

కుంటే మా అభ్యంతరం లేదు" అన్నారు పెద్దలు.

రామప్రభు స్నేహాన్ని పూసుకుని, కులం, రెండు వంశాల మధ్య గల బంధుత్వం తిరగేసి వత్సవాయి లాడ్జికివచ్చి 'మనం మనం ఒకటే' అని చెప్పాడు. అక్కడ వున్న ఓ పెద్ద వత్సవాయి కొడుక్కి రామప్రభు కూతుర్నివ్వడానికి రంగం సిద్ధం చేశాడు. ఎన్ని "ల" లో రామప్రభు చెప్పాడు. వత్సవాయి అంగీకరించాడు.

రామప్రభు అధికార శిబిరంలోకి దూరిపోయాడు. అతడికీ కుర్చీ కావాలి. వత్సవాయి వచ్చాక ఇప్పించకపోడు అనుకున్నాడు.

శతృత్వం సెలవు తీసుకుంది. అవసరాలు, అధికార దాహం దగ్గరకి చేర్చాయి వార్ని. గతాన్ని ఒక పీడ కలగా మరచిపోయారు.

ఓ నెల గడిచింది.

శీతాకాలం ఉదయం. మంచు మీద లేత ఎండ కాస్తోంది. వత్సవాయి వరిచేను కోయిద్దామని వచ్చాడు. ఇంకా కూలీలు రాలేదు.

పుల్లయ్య ప్రక్క తోటనుంచి చూశాడు. తనను దెబ్బ కొట్టినప్పటినుంచి కక్షగట్టాడు. దెబ్బ తీయాల ఎలాగయినా. పరుగున వచ్చి మామిడిచెట్టు వెనకాల దాంకున్నాడు. వత్సవాయి చెట్టు ఎదర కూర్చున్నాడు.

పుల్లయ్య వెనుకనుంచి తువ్వాలు వత్సవాయి కంఠానికి వేసి బిగించాడు. గట్టిగా... ఇంకా గట్టిగా మరీ గట్టిగా.

వత్సవాయి మనిషి కాదు-శవం!

"నన్ను కొట్టే మొగాడి వంట్రా?" పుల్లయ్య కాండ్రించి వుమ్మేసి వూళ్ళోకి వచ్చాడు. ఇంటి కెళ్ళాడు. రాజీ కల్లు అమ్ముతోంది. రెండు గ్లాసులు తెమ్మన్నాడు. "ఏం బెవ్వారం?" రాజీ అడిగింది. చెప్పాడు.

రామప్రభుతో చెప్పి మిగతా డబ్బు పుచ్చుకోడానికి వెళ్ళాడు. రామప్రభు ఈజీ ఛైర్‌లో పేపర్ చూస్తున్నాడు. వత్సవాయి వుప ఎన్నిక-నెల రోజుల్లో వుంది. ఎల క్షను అయిన మర్నాడే పెళ్ళి ముహూర్తం.

"వత్సవాయిని సంపేశానయ్యా! ఏడేలు పడేయండి!"

ఆయన బిగిసిపోయాడు. రెట్టించి అడిగాడు. "కొంచెం అలీసమైనా పూరితి సేసానండయ్యా!"

"ఎంత పని చేశావురా దుర్మార్గుడా?" రామప్రభు లోపలికెళ్లాడు. డబ్బుకి అనుకున్నాడు పుల్లయ్య. రామప్రభు పోలీసులకి ఫోన్ చేశాడు.

వాళ్ళువచ్చి అరెస్ట్ చేశారు.

"రామపెబు సంపమన్నాడు. నాకేం తెల్వదు" అన్నాడు పుల్లయ్య.

"నా వియ్యంకుడ్ని చంపమంటానా?...." అన్నాడు రామప్రభు.

రాజీ వచ్చి, "వత్సవాయి ఆ మధ్య పుల్లయ్యని కొట్టాడని, ఆ కసితో చంపేశాడని, చంపుతుండగా తను చూశానని" చెప్పింది.

పుల్లయ్య వూసల మధ్య.

రాజి నిజం ఎందుకు చెప్పింది? ●


# శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

హెడ్డాఫీస్:—5/1, బ్రాడీపేట, గుంటూరు-2 (ఎ.పి.)

బ్రాంచీలు: మార్వాడి గుడివద్ద, తెనాలి, ఫోన్ : 551.

26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17.

## దీర్ఘవ్యాధులకు వుత్తమ వైద్యము



దురభ్యాసములకు లోనై దాంపత్య సుఖము పొందలేని వారికి, (నిరుత్సాహముచే ప్రాణహాని చేసుకొనరాదు.) హెర్నియా, చర్మ వ్యాధులకు పోస్టు ద్వారా కూడా చేయబడును.

వరిబీజం (బుడ్డ), మూత్ర వ్యాధులకు ఇస్నోఫీలియా (దమ్ము), ఉబ్బసమునకు ఆపరేషన్ లేకుండా చేయబడును; స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

NB: "శివలీల" తెలుగు పక్షపత్రిక అన్ని విషయములతో వెలువడుతుంది; చదవండి.

ఎడిటర్:- డా. పి. కుమారస్వామి దేవర,
గుంటూరు (ఎ.పి.)